మట్టికుండ.. చల్లగుండ..

- పేదోడి ఫ్రిజ్‌కు భలే గిరాకీ
- జోరందుకున్న కుండల విక్రయాలు
- అంగడి నుంచి ఆన్‌లైన్ దాకా అందుబాటులో..

రాజమహేంద్రవరం రూరల్: మట్టికి మనిషికి విడదీయరాని సంబంధం ఉంది. ఇప్పుడంటే ప్రతి ఇంట్లో స్టీల్ పాత్రలు, ప్లాస్టిక్ క్యాన్‌లలో నీటిని నిల్వ చేస్తున్నాం గానీ ఒకప్పుడు కుండనీరే దాహార్తిని తీర్చేది. ముఖ్యంగా వేసవి సీజన్‌లో ప్రతి ఒక్కరూ చల్లటి కుండనీరు తాగి వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేవారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ఫ్రిజ్‌లు రావడం, ఇతర పాత్రలు అందుబాటు ధరల్లో లభ్యం కావడంతో కుండలకు గిరాకీ తగ్గిపోయింది. అయితే ప్రస్తుత వేసవి సీజన్‌లో మాత్రం కుండలు విక్రయాలు ఊపందుకున్నాయి. మట్టి కుండలకు ప్రజలు ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇంటిలో చల్లని నీరు తాగేందుకు, చలివేంద్రాల కోసం కూడా కుండలను కొనుగోలు చేస్తున్నారు. ట్యాప్‌లతో కూడిన కుండలు ఎక్కువగా అమ్ముడుపోతున్నాయి.


ఊపందుకున్న విక్రయాలు

జిల్లాలో ముఖ్యప్రాంతాలలో మట్టి కుండలు విక్రయాలు భారీ ఎత్తున సాగుతుండటంతో తయారీదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సహజసిద్ధమైన మట్టి నుంచి తయారు చేసే కుండలకు ప్రాచీన కాలం నుంచి ప్రాధాన్యం ఉంది. చాలా ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌ల మీద మట్టికుండలు విక్రయిస్తున్నారు. కుండ పరిమాణం బట్టి రూ.200 నుంచి రూ.1500 వరకూ అమ్ముతున్నారు. వేసవిలో కుండల వ్యాపారం జోరుగా సాగుతోంది. వీటిల్లో రకరకాల మోడళ్లు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా మట్టి కుండలకు మంచినీటి ట్యాప్‌లు ఏర్పాటు చేస్తున్నారు. వాటిని రంగులతో అందంగా తీర్చిదిద్దుతున్నారు. వివిధ రకాల మట్టికుండలను ఆన్‌లైన్‌లో సైతం విక్రయిస్తున్నారు.


విక్రయానికి సిద్ధమైన మట్టికుండలు

ప్రయోజనాలు

- మలినాలను పీల్చుకుని నీటిని చల్లగా మార్చే అద్భుత శక్తి మట్టి కుండకు మాత్రమే ఉంది.
- ఎండలో నుంచి వచ్చి కుండనీటితో ముఖం కడుక్కుంటే ఆహ్లాదంతో పాటు వడదెబ్బ నుంచి రక్షణ పొందవచ్చు.
- కుండనీటిలో సహజమైన మినరల్స్, ఎలక్ట్రోలైట్స్ ఉంటాయి. రోగనిరోధకశక్తి మెరుగుపడి జీవక్రియలను పెంచుతుంది. శరీరానికి శక్తి లభిస్తుంది.
- దగ్గు, ఆస్తమా, ఇతర శ్వాసకోశ వ్యాధులు దరిచేరవు.


రంగులు వేసిన కుండ


కుండ తయారు చేస్తున్న మండిపూడి సత్యనారాయణ

వేసవిలోనే విక్రయాలు

మూడుతరాల నుంచీ కుండలు తయారు చేస్తున్నాం. గతంలో తాగునీటికి, వంటలు చేసుకునేందుకు మట్టికుండలు వాడేవారు. ఇప్పుడు శుభకార్యాలకు, పూజలకు మాత్రమే మొక్కుబడిగా తీసుకువెళ్తున్నారు. ముఖ్యంగా వేసవి సీజన్‌లో మాత్రం కుండలు అధికంగా అమ్ముడుపోతున్నాయి. సైజును బట్టి మా వద్ద వ్యాపారులు కొనుగోలు చేసుకుని విక్రయాలు జరుపుతారు.

– మండిపూడి సత్యనారాయణ, కుండల తయారీదారుడు, పాత బొమ్మూరు

వినియోగం మంచిదే

వేసవి నేపథ్యంలో మట్టికుండల్లో నీరు తాగడం వల్ల మేలు జరుగుతుంది. అతి చల్లదనంతో సంబంధం లేకుండా శరీరానికి కావాల్సిన స్థాయిలో వెళుతుంది. మట్టికుండలు వినియోగించేటప్పుడు ఎప్పటికప్పుడు వాటిని శుభ్రంగా ఉంచుకోవాలి. వినియోగానంతరం ఇవి మట్టిలోనే కలిసిపోతాయి. వాతావరణానికి కూడా మంచిది.

– డాక్టర్ విజయకుమారి, రాజమహేంద్రవరం

క్లుప్తంగా

వేసవి శిక్షణ తరగతులు


తయారు చేసిన పేపరు బ్యాగులతో చిన్నారులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసుపేటశాఖా గ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం వేసవి శిక్షణ తరగతులు జరిగాయి. పుస్తక పఠనం, నీతి కథలు చెప్పడం, హ్యాండ్ క్రాఫ్ట్, డ్రాయింగ్, చదరంగం, తెలుగు పద్యాలు, లలిత సంగీతం తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మతల రమేష్, మాధవీ లత, బొడ్డు శ్రీనివాసు, వరలక్ష్మి, కొత్తల గోపాలకృష్ణ, కిర్ల తాతారావు పాల్గొన్నారు. విద్యార్థులకు ట్రస్ట్ ఆధ్వర్యంలో బిస్కెట్లు, మజ్జిగ పంపిణీ చేశారు.

సెలవుల్లో విద్యార్థులకు ప్రత్యేక కృత్యాలు

కంబాలచెరువు: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు సెలవుల్లో చదవటం మాకిష్టం కార్యక్రమాన్ని రూపొందించిన నేపథ్యంలో వేసవిలో సెలవులను వృథాగా గడపకుండా ఆయా తరగతి ఉపాధ్యాయులతో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి కొన్ని ప్రత్యేక కృత్యాలు పంపించామని డీఐ బి.దిలీప్ కుమార్ మంగళవారం తెలిపారు. వాటిని విద్యార్థులు పూర్తి చేసి ఆ గ్రూపుల్లో పోస్ట్ చేయాలన్నారు. దీనిలో భాగంగా 3, 4, 5 తరగతుల విద్యార్థులకు ప్రత్యేకంగా జిల్లా పరీక్ష నిర్వహణా సంస్థ ద్వారా తయారైన మెటీరియల్‌ను ప్రధానోపాధ్యాయులకు ఆయన అందజేశారు. సెలవుల అనంతరం విద్యార్థి పూర్తి చేసిన ఆ పుస్తకాలను తిరిగి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ జయంతి శాస్త్రి, జె.శ్రీనివాసరావు, పబ్బినీడి ప్రసాద్, కుమారి, ఇందిర, కోటీశ్వరి, నాగ లక్ష్మి పాల్గొన్నారు.

కళ్లజోళ్లు పంపిణీ


కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న పుల్లా ఆంజనేయులు తదితరులు

కడియం: లయన్స్ క్లబ్ కడియం నర్సరీస్ విభాగం ప్రారంభోత్సవం సందర్భంగా చార్టర్స్ ప్రెసిడెంట్ పుల్లా ఆంజనేయులు ఆధ్వర్యంలో ఇటీవల కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గుర్తించిన 100 మందికి మంగళవారం కళ్లజోళ్ల పంపిణీ చేశారు. కడియపులంకలోని సత్యదేవ నర్సరీలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో లయన్స్ సభ్యులు పుల్లా ఆంజనేయులు, బొర్సు సుబ్బారాయుడు, పుల్లా చినసత్యనారాయణ, నక్కా అమ్మిరాజు, పుల్లా వీరబాబు, రాజశేఖర్ చేతుల మీదుగా కళ్లజోళ్లు అందజేశారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

రాజమహేంద్రవరం రూరల్: రూరల్ నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అధికారులను ఆదేశించారు. ఆయన మంగళవారం బొమ్మూరులోని గోదావరి వాటర్‌ప్లాంట్‌ను పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. కడియం, రూరల్ మండలాల్లో తాగునీటి సదుపాయం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. అలాగే... రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం రూరల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ పైడి చిన్నారావుకు పార్టీ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. కడియం ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, మండల టీడీపీ అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, వెలుగుబంటి రఘురామ్, అన్నందేవుల చంటి పాల్గొన్నారు.

డాక్టర్ సూర్యకుమారి కన్నుమూత



కంబాలచెరువు: సిద్ధార్థ నర్సింగ్ హోమ్, పోలీ క్లినిక్ అధినేత డాక్టర్ బుద్దుడు సతీమణి డాక్టర్ దొంతంశెట్టి సూర్యకుమారి (65) మంగళవారం కన్నుమూశారు. ఆమె కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఆమె కుమారుడు డాక్టర్ మౌనిష్ ఎముకల వ్యాధి నిపుణులు, కోడలు డాక్టర్ శ్వేత కంటి వ్యాధి నిపుణులు. సూర్యకుమారి మృతికి నగరంలోని పలువురు వైద్యులు సంతాపం తెలిపారు.

ఫిర్యాదు చేయకపోయినా అరెస్టులా..?

సీటీఆర్ఐ: ఎవరు ఎటువంటి ఫిర్యాదు చేయకపోయినా మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు)లను అరెస్టు చేయడం అన్యాయమని తెలుగు మహిళ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత అన్నారు. తిలక్ రోడ్డులోని పార్టీ సిటీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీని పరామర్శించేందుకు మంగళవారం వచ్చిన వంగలపూడి అనిత.. శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు తదితరులతో కలిసి మీడియాతో మాట్లాడారు. 30 ఏళ్లుగా నీతిగా వ్యాపారం చేస్తున్న ఆదిరెడ్డి వారిని అరెస్టు చేశారన్నారు. ఫిర్యాదు లేకుండా ఇంటికి వచ్చి అరెస్ట్ చేయడం ఏమిటని ప్రశ్నించారు.

దుర్గాబాయి దేశ్‌ముఖ్‌కు నివాళి

ప్రకాశం నగర్: స్థానిక స్వాతంత్ర్య సమరయోధుల పార్కులో మంగళవారం ఆంధ్రకేసరి యువజన సమితి ఆధ్వర్యంలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ వర్ధంతి నిర్వహించారు. ఆమె విగ్రహానికి సమితి సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ దుర్గాబాయి స్థాపించిన ఆంధ్ర మహిళ సభలు రెండింటిలో ఒకటి మద్రాసులో, రెండోది హైదరాబాద్‌లో ఉండిపోయాయన్నారు. ఆమె జన్మించిన రాజమహేంద్రవరంలో ఆంధ్ర మహిళ సభ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకురాలు పి.కల్యాణి, లంక సత్యనారాయణ, సమితి పూర్వ అధ్యక్షుడు మాదిరాజు శ్రీనివాస్, సభ్యులు దూర్వాసుల సత్యనారాయణ, దేవత సుధాకర్ పాల్గొన్నారు.

'ఆదిపురుష్' ట్రైలర్ విడుదల

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రభాస్ ప్రధాన పాత్రలో నటించిన 'ఆదిపురుష్' పాన్ ఇండియా సినిమా ట్రైలర్‌ను నగరంలోని సాయికృష్ణ (అనుశ్రీ), సూర్య పాలస్ థియేటర్లలో మంగళవారం సాయంత్రం 5.04 గంటలకు త్రీడీ ఎఫెక్ట్‌తో అభిమానుల కేరింతల నడుమ విడుదల చేశారు. అందరికీ త్రీడీ కళ్లజోళ్లు అందించారు. ఈ సందర్భంగా అభిమానులు ఉత్సాహంగా సందడి చేశారు. జిల్లా పంపిణీదారులు లక్ష్మీనరసింహ, శ్రీమణికంఠ ఫిలిమ్స్ పక్షాన ప్రతినిధులు పర్యవేక్షించారు. అలాగే ధవళేశ్వరం మురళీకృష్ణ, కాకినాడ దేవీ మల్టీప్లెక్స్, లక్ష్మి, అమలాపురం వెంకట పద్మావతి సినీప్లెక్స్, మండపేట కృష్ణ, రావులపాలెం అక్షర, మల్కిపురం పద్మజ, రామచంద్రపురం కిషోర్, జగ్గంపేట రాజవేణి, కిర్లంపూడి సూర్యరామ థియేటర్లలో ఈ చిత్ర ట్రైలర్ ప్రదర్శించారు. జూన్ 16న ఈ చిత్రం థియేటర్లలో సందడి చేయనుంది.

ఎస్సీ భూముల అన్యాక్రాంతానికి యత్నం

- రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ విక్టర్ ప్రసాద్
- పిడింగొయ్యిలో క్షేత్రస్థాయి పరిశీలన

రాజమహేంద్రవరం రూరల్: ఎస్సీల భూములను అన్యాక్రాంతం చేయడానికి అధికారులు ప్రయత్నించడం దారుణమని రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. మంగళవారం సాయంత్రం పిడింగొయ్యిలోని భూ సమస్య ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. పిడింగొయ్యి ఎస్సీలకు చెందిన భూ సమస్యపై పలుమార్లు తన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో వాస్తవ పరిస్థితిని పరిశీలించేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించడం జరిగిందన్నారు. కొందరు అధికారులు నేటికీ కులవివక్షత చూపిస్తూ అంబేడ్కర్ విగ్రహానికి దండ వేయనివ్వకుండా మెట్లు కట్టుకోనివ్వకుండా అడ్డుకోవడం సరికాదన్నారు. ఎస్సీ భూముల విషయంలో భూపత్రాలు, కోర్టు ఆర్డర్లు, భూమి స్థితిగతులను కూలంకుషంగా పరిశీలించి అర్థం చేసుకున్నట్టు తెలిపారు. పిడింగొయ్యిలో ఆర్ఎస్ నంబర్ 511/1 నందు 10 ఎకరాల 60 సెంట్లు ఉంటే అందులో నాలుగు ఎకరాలు ఒక ఎస్సీ కుటుంబానికి ఇచ్చారన్నారు. ఒక ఎకరం 60 సెంట్లను శ్మశానవాటికకు ఉంచారన్నారు. మిగిలిన భూమిని అక్కడ హరిజన మాలలకు ఇచ్చినట్లు రికార్డులు ద్వారా తెలిసిందన్నారు. నాలుగు ఎకరాల స్థలం ఆర్‌టీవో కార్యాలయంనకు ఇచ్చే ప్రపోజల్ ఏమీ లేదని, అలాగే రెవిన్యూ అధికారులకు ఎస్సీ కులస్తులకు ఇచ్చినట్లయితే పేరు మీద కాకుండా సొసైటీ పేరుమీద సమష్టిగా ఇవ్వాలని సూచించారు. సదరు భూమిని ఎస్సీల ప్రయోజనం కోసం మాత్రమే సద్వినియోగం చేయాలన్నారు. ఇందు కోసం కమిషన్ వారి పక్షాన నిలుస్తుందన్నారు. కొందరు రెవెన్యూ అధికారులు తెలుగుదేశం పార్టీ కోవర్టుల్లా పనిచేస్తూ ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి దళిత ద్రోహి అన్నారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విగ్రహానికి మెట్లు కట్టడానికి ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పైడిచిన్నారావు, డిప్యూటీ తహసీల్దార్ రత్నసాగర్, బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ ఆర్.విజయకుమార్, దళిత నాయకులు అజ్జరపు వాసు, పరమట గణేశ్వరరావు, పట్నాల విజయకుమార్, సుందరపల్లి అనిల్, నక్కా విజయ కుమార్, గెద్దం ప్రభు ప్రసాద్, అల్లంపల్లి శ్రీనివాస్, వారా కిరణ్, తుమ్మల తాతారావు, కురుమళ్ల భానుచందర్ పాల్గొన్నారు.


పిడింగొయ్యిలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్

బూరాడ భవానీ శంకర్ హత్య దారుణం


కృష్ణమాధురిని ఫోన్‌లో పరామర్శిస్తున్న ఎంపీ భరత్‌రామ్

- నిందితులను వదిలేది లేదు
- న్యూఢిల్లీ నుంచి ఫోన్‌లో మృతుడి భార్యను పరామర్శించిన ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక 44వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బూరాడ భవానీ శంకర్ హత్య దారుణమని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. న్యూఢిల్లీలో ఉన్న ఆయన పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి ఆధ్వర్యంలో బూరాడ భవానీ శంకర్ భార్య కృష్ణ మాధురిని ఫోన్‌లో పరామర్శించారు. దాడి ఎలా జరిగింది, కారణాలేమైనా ఉన్నాయా తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఎస్పీకి ఫోన్ చేసి మాట్లాడానని, ఈ ఘటన వెనుక బాధ్యులెవరైనా వదిలేదని ఎంపీ తెలిపారు. భవానీ శంకర్ తనకు అత్యంత ఆప్తుడన్నారు. పార్టీ కుటుంబ సభ్యులందరూ మీకు అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తారని భరోసానిచ్చారు. కాగా.. భవానీ శంకర్ హత్య విషయం తెలిసిన వెంటనే నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, సంకిస భవానీ ప్రియ, నక్కా నగేష్, పోలు విజయలక్ష్మి శీతనబోయిన సాయిరామ్, కాంతారాం పాటిల్, గణేష్ రెడ్డి, కృష్ణవేణి తదితరులు భవానీ శంకర్ ఇంటికి వెళ్లారు.

తపాలా ఉద్యోగ సంఘాల గుర్తింపు రద్దు అన్యాయం


నిరసన తెలుపుతున్న తపాలా ఉద్యోగులు

రాజమహేంద్రవరం సిటీ: తపాలాశాఖ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్న జాతీయ తపాలా ఉద్యోగుల సమాఖ్య (ఎన్ఎఫ్‌పీఈ), అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం (ఏఐపీఈయూపీ3) గుర్తింపు రద్దు చేయటం అన్యాయమని అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం రాజమహేంద్రవరం డివిజన్ కార్యదర్శి బి.కొండబాబు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం తెచ్చిన నూతన రైతు చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన రైతు ఉద్యమానికి ఆర్థిక సహాయం చేశారన్న కారణంగా రెండు యూనియన్ల గుర్తింపు రద్దు చేయడం దారుణమన్నారు. 70 శాతం ఉద్యోగులు సభ్యులుగా ఉన్న ఈ రెండు యూనియన్ల గుర్తింపు రద్దుకు వ్యతిరేకంగా జాతీయ తపాలా ఉద్యోగుల సమాఖ్య జాతీయ నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు రాజమహేంద్రవరం ప్రధాన తపాలా కార్యాలయం మంగళవారం నిరసన తెలిపారు. కొండబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేతిలోని ఒక గుర్తింపు లేని ఉద్యోగ సంఘం ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండు యూనియన్ల గుర్తింపు రద్దు చేయడం వంటి కక్ష్యసాధింపు చర్యలు తీసుకోవడం దారుణమన్నారు. యూనియన్ ప్రెసిడెంట్ యూజీ ప్రకాష్, తపాలా పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వాస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన

గోకవరం: కొత్తపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించే ప్రభుత్వాస్పత్రికి బుధవారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు శంకుస్థాపన చేయనున్నట్టు జగ్గంపేట మార్కెట్ కమిటీ ఛైర్మన్ జనపరెడ్డి బాబు తెలిపారు. ఉదయం నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన అనంతరం తాత్కాలిక భవనాన్ని ప్రారంభిస్తారన్నారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొవాలన్నారు.

నేటి నుంచి ప్రతిష్ఠా మహోత్సవాలు

బిక్కవోలు: మండలంలోని మోళ్లూరు విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు ఈ నెల 10 నుంచి 14 వరకూ జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం గోపూజ, గురువారం వేదపారాయణం, విఘ్నేశ్వరపూజ, శుక్రవారం 108 కలశాలతో మహా కుంభాభిషేకం, శనివారం హోమాలు, మహా అన్నసమారధన నిర్వహిస్తామని తెలిపారు. భక్తులందరూ హాజరై స్వామిని దర్శించుకోవాలని కోరారు.

12న మండల సమావేశం

మధురపూడి: కోరుకొండ మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 12వ తేదీన నిర్వహిస్తామని ఎంపీడీఓ పీఎస్ నరేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఎంపీపీ ఉల్లి వీర వెంకట సత్య సూర్యకుమారి అధ్యక్షతన కాపవరం ఎంపీడీఓ కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం జరుగుతుందన్నారు. మండలంలోని వివిధ శాఖల వారీగా సమీక్ష జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, సంబంధిత అన్ని శాఖల అధికారులు హాజరుకావాలన్నారు.

వైభవంగా కన్నమాంబ జాతర మహోత్సవాలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నగరపాలక సంస్థ పరిధిలోని 19వ డివిజన్‌లో కొలువైన కన్నమాంబ పేరంటాలమ్మ 125వ జాతర మహోత్సవాలు మంగళవారం గొందేశి పూర్ణచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు, ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా జరిగాయి. జాతరలో భాగంగా అమ్మవారి ఘటాలను ఊరేగింపుగా అర్ధరాత్రి రైల్వే స్టేషన్ ఎదురుగా శ్రీకన్నమాంబగుడి వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వేషధారణలు, ప్రదర్శనలు, బాణసంచా కాల్పులు ఆకట్టుకున్నాయి. ఉదయం కన్నమాంబ అమ్మవారి ఆలయంలో గొందేశి శ్రీనివాసులు రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.


అమ్మవారి జాతరలో పాల్గొన్న గొందేశి శ్రీనివాసులు రెడ్డి

యువతి అదృశ్యం

కంబాలచెరువు: స్థానిక మంగళవారపుపేటకు చెందిన యువతి (27) అదృశ్యమైన సంఘటనపై ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. ఈనెల రెండో తేదీ నుంచి తన కుమార్తె కనిపించడంలేదని ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణపై స్పందించిన కేంద్రం

రాజమహేంద్రవరం రూరల్: ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని కేంద్రం స్పష్టం చేసిందని, ఈ మేరకు సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్మెంట్ నుంచి మాదిగ రాజకీయ పోరాట సమితికి లేఖ వచ్చిందని సమితి జాతీయ అధ్యక్షుడు ఆకుమర్తి చిన్నమాదిగ అన్నారు. మంగళవారం కాతేరు గ్రామంలో మాదిగ రాజకీయ పోరాట సమితి జిల్లా నూతన అధ్యక్షుడు మేకల సూర్యారావు ప్రమాణ స్వీకారం సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గత సంవత్సరం ఢిల్లీలో సుమారు 20 రోజుల పాటు పర్యటించి, కేంద్ర మంత్రులు, అన్ని పార్టీల పార్లమెంటు సభ్యులను కలిసి ఎస్సీ వర్గీకరణ సమస్యను త్వరగా పరిష్కరించాలని వినతి పత్రాలు సమర్పించామన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం.. రాష్ట్రాలే వర్గీకరణ చేసుకోవచ్చని, కానీ రాష్ట్రాలు పట్టించుకోవట్లేదని స్పష్టం చేసిందన్నారు. ఎస్సీ వర్గీకరణపై తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు అడ్డంకులు తొలగించాలని, మాదిగలపై గత ప్రభుత్వాలు పెట్టిన కేసులన్నీ ఎత్తివేయాలని, రాష్ట్రంలో అన్ని పార్టీలు మాదిగలకు 15 అసెంబ్లీ స్థానాలు, 2 పార్లమెంటు స్థానాలు, ఒక రాజ్యసభ కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఉభయ గోదావరి జిల్లాల మహిళా ఇన్‌చార్జి ఎల్లబెల్లి ఝాన్సీ, ఏడిద ప్రసన్నకుమార్, పెనుమాక సునీల్, పోసుపో రత్నరాజు, ఉండ్రాజవరపు సూర్య పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న ఆకుమర్తి చిన్నమాదిగ

విద్యాకుసుమాలు.. ఈ సోదరీమణులు

రంగంపేట: కృషి, పట్టుదల ఉంటే ప్రతిభకు పేదరికం అడ్డుకాదని, ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుకునే మంచి ఫలితాలు సాధించొచ్చని రుజువు చేశారు రంగంపేటకు చెందిన సోదరీమణులు చాగంటి మంజుశ్రీరమ్య, బేబీజాహ్నవి. మంజుశ్రీరమ్య స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ చదువుకుని ఇంటర్మీడియట్ ఫలితాల్లో 1000 మార్కులకు గాను 857 మార్కులు సాధించి కళాశాలలో ద్వితీయ స్థానంలో నిలిచింది. బేబీ జాహ్నవి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకుని 600 మార్కులకు గాను 535 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచింది. విద్యార్థినుల తండ్రి చాగంటి పద్మనాభం వ్యవసాయ కూలీ కాగా తల్లి గృహిణి.

వీరిద్దరూ మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథిలు ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.


ఉత్తమ ఫలితాలు సాధించిన సోదరీమణులు మంజుశ్రీరమ్య, బేబీ జాహ్నవి